కథ

# ఆలోచించండి

**శివల పద్మ**

"ఏమిటా ఇన్విటేషన్ కార్డు?" ఆఫీస్ నుంచి రాగానే టేబుల్ మీద ఉన్న కార్డు చూసి అడిగాడు శ్రీధర్.

"ప్రేరణ చిల్డ్రెన్స్ క్లబ్ వాళ్ళ వార్షికోత్సవం అట. ఏవో చాలా ప్రోగ్రామ్‌లు ఉన్నాయి" చెప్పింది రేవతి.

"పిల్లల పరీక్షలైపోయాయిగా...వెళ్దాం. వాళ్ళకి కూడా నేర్చుకోనేందుకు అవకాశం ఉంటుంది" కార్డు చదువుతూనే చెప్పాడు.

ముచ్చట గొలిపే ఓ చిన్న ఇంటి ముందు షామియానా వేసి ఉంది. గేటు పక్కన పట్టులంగాలతో ఉన్న ఇద్దరు ఆడపిల్లలు వస్తున్న అతిథులకు ముద్దుగా స్వాగతం పలుకుతున్నారు.

మిగతా పిల్లలంతా క్రమశిక్షణతో తలా ఓ పని చేస్తున్నారు.

అనుకున్న సమయానికి నిముషాలతో సహా కార్యక్రమం ప్రారంభం అయింది.

లేత నీలిరంగు కాటన్ చీరలో హుందాగా ఉన్న అన్విత దయాస్‌పైకి వచ్చింది.

"విచ్చేసిన అతిథులందరికీ నా నమస్కారం,

మేము మీకు తెలియపర్చిన ప్రకారం మీరు ముందు ఈ చిల్డ్రెన్ క్లబ్ మెంబర్లయిన కొద్దిమంది చిన్నారులు అమర్చిన ఎగ్జిబిషన్ చూడబోతున్నారు. మీకు నచ్చిన వస్తువులు కొనుక్కుంటే అది ఆ పిల్లలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. అది అయిన తరువాత మన చిన్నారి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమం ఉంటుంది"

అందరూ ఎగ్జిబిషన్ చూడడానికి లేచారు. ఆ హాల్లోకి అడుగుపెడుతూనే అందరినీ ఒక్కసారిగా సంభ్రమం ఆవహించింది!

పూసలతో అద్దాలతో చేసిన చిన్న చిన్న పెన్‌స్టాండ్‌లు, కేండిల్ స్టాండ్‌ల దగ్గర్నుంచి-చక్కని పెయింటింగ్‌లు ఏ పెద్ద వాళ్ళకీ తీసిపోని విధంగా మలచిన ఆకృతులు-మనస్సుని ఆకట్టుకునే కలర్ కాంబినేషన్స్..

ఇంత చిన్న బుర్రల్లో ఇంత ఆలోచనా అని అబ్బురపరిచే విధంగా ఉన్నాయి ఆ కళాకృతులు.

ఇంకాస్త ముందుకి వెళితే చిన్నారి చేతులతో చెక్కిన చిన్ని చిన్ని శిల్పాలు దర్శనమిచ్చాయి.

వారికి చేతనైనంత వరకూ పెర్‌ఫెక్షన్ తీసుకువచ్చే ప్రయత్నం కనిపిస్తోంది ఆ శిల్పాల్లో. కొన్ని శిల్పాలు ముద్దుగా తీరుగా ఉన్నాయి. అలా చూస్తూ పోతూ ఉంటే అనేక రకాల కళాకృతులు!

పూసలు, కాటన్, మట్టి, శంఖాలు...ఒకటేమిటి..వారికి చేతికి దొరికిన ప్రతి వస్తువులోనూ జీవం పోసారు.

మైనం, రంగులు, చమ్కీలు, పెర్‌ఫ్యూమ్ కలిపి చేసిన కొవ్వొత్తులు..అవి పసిపిల్లల చేతుల్లో రూపుదిద్దుకున్నవి అంటే నమ్మశక్యం కావడం లేదు.

వచ్చిన వారంతా ఆశ్చర్యానికిలోనై తరువాత ఆ పిల్లల్ని మనసారా ప్రశంసించారు.

అనుకున్న ప్రకారం సాంస్కృతిక కార్యక్రమం ప్రారంభం అయింది. అందరూ పిల్లలే...

తబలా, ఫ్లూట్, ఎలక్ట్రికల్ గిటార్..ఆర్కెస్ట్రా అంతా వారే ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలు ఒక మగపిల్లవాడితో సంగీత కార్యక్రమం సాగింది.

శాస్త్రీయ సంగీతాన్ని అంత బాగా నేర్చుకుని తమ గాన మాధుర్యంతో శ్రోతలను పరవశింపజేసిన ఆ బాల కళాకారుల ప్రతిభ ఎందరినో అచ్చెరువొందేలా చేసింది.

వారి కార్యక్రమం పూర్తికాగానే అన్విత దయాస్ పైకి వచ్చింది.

"ఆదరంతో మా ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడకు విచ్చేసిన మీ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. వయస్సుతో పనిలేకుండా ఏ కళాకారుడికైనా కావలసింది చప్పట్లు, ప్రశంసలే. ఈనాటి మీ ప్రశంసలు వీరందరినీ ఎంతో ప్రోత్సాహాన్నిచ్చి ముందుకు నడిపిస్తాయనడంలో సందేహం లేదు. అదే విధంగా వీరిలో అద్భుతమైన సృజనాత్మకత శక్తి కళ ఉన్నాయనడంలో మీరు నాతో ఏకీభవిస్తారనే నా నమ్మకం. ఇక్కడ ఎంతో మంది పేరెంట్స్ ఉన్నారు. వారిలో చాలామందికి అన్పించి ఉండవచ్చు-వారి పిల్లలు కూడా ఇలా ఒక చక్కని కళతో ముందుకి వస్తే బాగుండేదని. ఇలా పెద్దలు కూడా ముగ్ధులయ్యేటంత సంగీత కళాకారులు అవుతే బాగుండేదని. అలా అన్పించినా ఆశ్చర్యం లేదు. అయితే ఇక్కడ నేను మీకో నిజాన్ని చెప్పాలనుకుంటున్నాను. వీరంతా కూడా చదువులలో వెనుకబడిన పిల్లలు. కొందరైతే స్కూలు వదిలేసిన వారు కూడా ఉన్నారు."

అక్కడ ఒక్కసారి నిశ్శబ్దం అలుముకుంది! రెండు మూడు క్షణాల తర్వాత చిన్నగా సంచలనం రేగింది.

"చిన్నపిల్లల క్లబ్‌గా మీకందరికీ పరిచయమైన మా ప్రేరణ సంస్థ స్థాపన వెనుక ఉద్దేశ్యం వేరు- ఆశీష్ ఒక టెంత్ క్లాస్ అబ్బాయి. అద్భుతమైన గొంతుని భగవంతుడు అతడికిచ్చాడు. స్కూల్లో ప్రతి వార్షికోత్సవానికి అతడి పాట కచ్చితంగా ఉండేది. దురదృష్టవశాత్తూ చదువులో కాస్త వెనుకబడి ఉండేవాడు. జ్ఞాపకశక్తి కూడా తక్కువ ఉండేది. అయితే పిల్లల్లో అది సహజం కనుక దాన్ని ఎవరూ పట్టించుకునేవారు కాదు. కానీ ఇంట్లో అతడికి చదువు గురించి ఒత్తిడి చాలా ఎక్కువగా ఉండేది. ఇంట్లో పాటలు పాడితే అసలు ఒప్పుకునేవారు కాదు. పాటలు తిండి పెడతాయా అంటూ అతడి గొంతు నొక్కేసేవారు. కానీ వార్షికోత్సవంలో అతడి గొంతు విన్న ఓ సంగీతదర్శకుడు స్వయంగా స్కూల్‌కి వచ్చాడు ఆ అబ్బాయి కోసం. కానీ...ఆ ముందురోజే టెంత్ క్లాస్ ఆఖరు పరీక్ష రాసిన ఆ పిల్లాడు పరీక్ష బాగా రాయలేకపోయినందువలన, తల్లిదండ్రులు తిడతారన్న భయంతో ఆత్మహత్య చేసుకున్నాడు" అన్విత గొంతు బాధతో వణికింది.


సూదిపడితే వినవచ్చేటంత నిశ్శబ్దం చోటు చేసుకుంది అక్కడ!

"అమృతాన్ని చిందించిన అతడి గానమాధుర్యం ఏమిటో నాకు తెలుసు. ఎందుకంటే- అతడి టీచర్లలో నేనొకదాన్ని కనుక. అటువంటివాడు అలా అకస్మాత్తుగా రాలిపోవడం నాకు చాలా షాక్ కలిగించింది! అప్పుడే నిర్ణయించుకున్నాను. ఇక మీదట ఎదుగుతున్న వారు ఎప్పటికీ ఇలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని- వారికా పరిస్థితులు రాకూడదని. ఆ పసిపిల్లాడిచ్చిన ప్రేరణతోనే ఈ 'ప్రేరణ'ను ప్రారంభించాను. మా సంస్థ లక్ష్యం ఒకటే- పిల్లల్లో అంతర్గతంగా ఉండే టాలెంట్‌ని వెలికి తీయడం-ప్రోత్సహించడం-వారిని గర్వంగా సమాజం ముందుకి తేవడం!

దానికోసం స్కూళ్ళను అప్రోచ్ అవుతాం. చదువులో కాస్త మందకొడిగా ఉండే పిల్లల లిస్ట్ తీసుకుంటాం. ఆ తరువాత స్కూళ్ళ యాజమాన్యం అనుమతితో వారితో ఒక క్లాసు తీసుకుంటాం. చాలా సహజంగా కాలక్షేపానికి మాట్లాడుతున్నట్లుగా మాట్లాడుతూ వారికి నచ్చే విషయాలను గుర్తుపడతాము. అలాగే వారిలో స్వతసిద్ధంగా ఉన్న టాలెంట్‌ని కూడా ఐడెంటిఫై చేస్తాం. చాలాసార్లు ఈ రెండూ ఒకటి కావు. ఒకమ్మాయి పెయింటింగ్స్ బాగా వేయగలుగుతుంది. కానీ డాన్స్ అంటే మోజు పడుతుంది. పక్కపిల్ల నేర్చు

కుంటోందనో లేక తన అభిమాన హీరోయిన్ చేస్తుందనో- ఇటువంటి కారణాలతో వాళ్ళు కొన్ని ఇష్టపడతారు. ఈ రకమైన ఇష్టం ఎక్కువకాలం ఉండదు. వెంటనే మరొకటి నచ్చుతుంది. అయితే పుట్టుకతో కొంతమందికి కొన్ని టాలెంట్స్ వస్తాయి. అవి వారికి భగవంతుడిచ్చిన వరం. వాటిని గుర్తుపట్టి- సానపెడితే ఆ లైన్లో వారు సులభంగా పైకి వస్తారు. దానికి కాస్తంత ఓర్పు కావాలి.

ఆ కళ ఎంత గొప్పదో వారికి అర్థమయ్యేలా చెప్పగలగాలి. దాన్లో పైకి వచ్చి పేరు తెచ్చుకున్న కొంతమందిని 'రోల్ మోడల్స్'గా పరిచయం చేయాలి. ఆ విజయం సాధించడానికి మీరైతే ఎక్కువ కష్టపడక్కర్లేదు. ఎందుకంటే



అది మీలో సహజంగా ఉంది అని వారికి తెలియచెప్పాలి. వారిపై వారికి విశ్వాసం కలిగేలా చేయాలి. తరచూ వారిలో ఉండే ఆ కళని మెచ్చుకుంటూ ఉండాలి. అది వారిలో ఒక రకమైన ఉత్తేజాన్ని నింపుతుంది.

ఇవన్నీ ఒక ఎత్తయితే పిల్లల్ని ఆ లైన్లో ముందుకి తీసుకోవడానికి పేరెంట్స్‌ని ఒప్పించడం ఒక ఎత్తు. మా ప్రయత్నాలు, మా ఆలోచన వెర్రితనంలా కన్పించేది చాలామందికి. 'వారిని భయపెట్టి అయినా చదివించాలి గానీ ఇలా కళలూ కాకరకాయలూ అంటే రేపు వాడెలా బ్రతుకుతాడు? మా కొద్దీ కళలు..' అని చెప్పేసిన వారూ ఉన్నారు. 'పిల్లలకేం తెలియదు. వారిలో టాలెంట్ ఏమిటి? వాళ్ళకి అన్నీ నచ్చుతాయి' అని పెదవి విరిచిన వారూ ఉన్నారు. అన్నిరకాల వారినీ కలిసి, ప్రాధేయపడి, ఒప్పించి పిల్లల్ని ఈ క్లబ్ మెంబర్లుగా చేసుకున్నాం.

వారందరికీ వారికి నచ్చిన పని చేసే స్వేచ్ఛ ఇచ్చి కొద్దిరోజులు వదిలేసాం. అది వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితెచ్చింది. కాస్తంత ప్రోత్సాహం అందిస్తే వారు ఎలా రాణిస్తారో ఒకొక్కరూ నిరూపించారు. అది మీరూ చూసారు.

ఇది కేవలం మా చిన్న ప్రయత్నం మాత్రమే. ఈ సందర్భంగా నేను పేరెంట్స్‌కి నాలుగు మాటలు చెప్పాలని అనుకుంటున్నాను.

మనం ఎంత డబ్బు పోసి కార్పొరేట్ స్కూళ్ళల్లో చేర్పించినా పిల్లలందరూ ఒక్కలా ఉండరు. కాంపిటీషన్ ఒక్కలాగే ఉంటే ఉండవచ్చునేమో కానీ పిల్లల గ్రహణశక్తి ఒక్కలా ఉండదు. అది విస్మరించి కాంపిటీషన్ పేరుతో అందరినీ ఒకే సమానంగా నిలుచోబెట్టి పరుగెత్తిస్తున్నారు. వారిమీద చాలా ఒత్తిడి తెస్తున్నారు. ప్రపంచంలో ఉన్న పోటీకి పిల్లల మెదడుకీ ఎటువంటి సంబంధం లేదు. పోటీ వున్నది కదా అని రేయీ పగలూ వారిని రుద్దేస్తే దాంతో వాళ్ళు సానబెట్టిన వజ్రాల్లా అయిపోరు. వారు వారిలాగే ఉంటారు.

ఇక రెండవది- ఈ ప్రాసెస్‌లో పిల్లల్లో కాస్తంత సున్నితత్వమో, సృజనో, ఒక ప్రత్యేకతో-ఏది ఉన్నా అవి మరుగున పడిపోతున్నాయి. వాటికెలాంటి గుర్తింపు ఉండడం లేదు.

సన్నగా కూనిరాగం తీస్తే ఈ సంగీతాలు మనకేమైనా తిండి పెడతాయా? అంటారు.

పెన్సిల్ పట్టుకుని నాలుగు గీతలు గీస్తే ఈ కళలు కడుపునింపుతాయా అంటారు. చదువు సంపాదన తప్ప జీవితంలో మిగతావన్నీ వ్యర్థం అనే దృక్పథంతో పిల్లల్ని పెంచుతున్న తల్లిదండ్రులు అనేకమంది నాకు తెలుసు. పెద్దలు మీరంతా. మీకు తెలియని విషయం కాదు. చదువు కేవలం సంపాదనని ఇస్తుంది. కళ మనిషికి శాశ్వతత్వాన్ని ఇస్తుంది. అంతేకాదు ప్రతి ఒక్కరూ కావాలనుకున్నా కళాకారులు కాలేరు. అది భగవత్ప్రసాదం. పుట్టుకతో వారు తెచ్చుకున్న వరం. దాన్ని మనం చిదిమేసి చదువుపేరిట కాలరాసేస్తున్నాం.

మనిషి తనకిష్టమైన పని చేయడంలో అపరిమితమైన ఆనందం పొందుతాడు. ఆ ఆనందంతో రేయీ పగలూ ఆ పని ధ్యాసలోనే ఉంటాడు. అది ఒక తపస్సులాంటిది! అంతటి అంకితభావం ఆ పనిపట్ల ఉండడం వలన ఆ పని ఒక మాస్టర్ పీస్ అవుతుంది. ఈ అంకితభావమే దానికి పరిపూర్ణత్వాన్ని ఇస్తుంది. ఈరోజు మీరు చూసిన ఒక్కో వస్తువులోనూ వారెంత ఆలోచన పెట్టి ఉంటారో- మీరు ఊహించలేరు..ఆ ఇష్టమే వారి

కంత ప్రతిభను ఇచ్చింది"

పేరెంట్స్ నిశ్శబ్దంగా వింటున్నారు. పిల్లలు కూడా తమ అల్లరి మరిచి నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఈలోగా మరికొంతమంది పేరెంట్స్ వచ్చి వెనుక వైపు కూర్చున్నారు. రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత అన్విత కొనసాగించింది.

"కళలనే కాదు. కొంతమందిలో మంచి నాయకత్వ లక్షణాలు ఉంటాయి. కొంతమందిలో చక్కని కార్యదక్షత ఉంటుంది. ఇంకొంతమందిలో తమకిచ్చిన బాధ్యతను చక్కగా నిర్వర్తించి ఫలితాలనిచ్చే నేర్పు ఉంటుంది. జీవితంలో ఎదగడానికి చదువుకన్నా కూడా ఇవే ముఖ్యం. కానీ మన పిల్లల్లో ఆ లక్షణాలను మనం గుర్తిస్తున్నామా! గుర్తుపడితే ప్రోత్సహిస్తున్నామా?

ఆ ప్రతిభకు మెరుగులు దిద్దుకునే వాతావరణాన్ని కల్పిస్తున్నామా? దేశమంటే అత్యధిక వేతనాలు పొందే ఉద్యోగులేనా? దేశానికి ఇంకెవరూ అవసరం లేదా? ఒక్కసారి ఆలోచించండి. ఈ ధోరణిలో పడి మనం మనకు చెందిన ఎన్నో అద్భుత కళలను వదులుకున్నాం. నిర్లక్ష్యం చేస్తున్నాము. మీరే చెప్పండి- ఒక్కో ప్రాచీన ఆలయంలోని శిల్పకళను చూస్తే శిరస్సు వంచి ప్రణమిల్లాలని అన్పించే శిల్పకారులున్న దేశమిది!

నేడేదీ ఆ శిల్పకళ? దానికి మనం ఎంత ఊతమిస్తున్నాం? నేటి తరం గర్వపడేందుకు ఆ తరం మిగిల్చిన వారసత్వ సంపద ఉంది. కానీ రేపటితరానికి గర్వకారణమయ్యేలా మనం ఏం చేస్తున్నాం? ఆ ఆలోచనతోనే మా క్లబ్‌లో శిల్పకళను నేర్పించే ఏర్పాటు చేసాము. మీరు చూసిన శిల్పాలు ఆసక్తి ఉన్న పిల్లలు చెక్కినవే.

ఈ వయస్సులోనే వీరింత ప్రతిభ కనబరుస్తే వీరికీ తగిన వాతావరణం కల్పిస్తే భావితరాలకు వీరు గర్వకారణం కాగలరు. మరోసారి దేశవైభవాన్ని, వైశిష్ట్యతనూ చాటే కళాకారులు అనేకమంది వస్తారు.

చివరగా నేను మిమ్మల్ని ప్రార్థించేది ఒకటే-

చదువులో వెనుకబడిన పిల్లలను వేధించకండి. గమనించండి. వారు ఏవైపు మొగ్గు చూపుతున్నారో..వారి చదువు సాధారణంగా సాగినా నిరాశ చెందకండి. నిందించకండి.

మీరు వారిని నిరాశపరిచే కొలదీ వారు రెండింటికీ దూరం అవుతారు. వారికి నచ్చిన పనిని చేయలేరు. మీరు చూపిన మార్గంలో కూడా మనస్ఫూర్తిగా వెళ్ళలేరు. ఆ కారణంగా వారు సాధారణంగా ఉండిపోతారు.

దయచేసి అటువంటివారిని తయారుచేయకండి. ఆర్థికంగా మీకు ఇబ్బంది లేకపోతే వారికి నచ్చిన లైన్‌ని వారిని ఎంచుకోనివ్వండి. అటువంటి ఇబ్బంది ఉంటే మా క్లబ్‌లో చేర్పించండి. వారికి నచ్చిన విద్య నేర్చుకునే అవకాశం మేము కల్పిస్తాం.

ఇప్పుడు మీరు చూసిన విద్యార్థులలో కొంతమంది మా సహకారంతో వచ్చిన వారున్నారు. ఇంకొంతమందిని మా విన్నపం మన్నించి వారి తల్లిదండ్రులు అర్థం చేసుకుని ప్రోత్సహించిన వారున్నారు.

ఈ పని తల్లిదండ్రులుగా ముందు మీకే సాధ్యం అవుతుంది. కనుక ఒక్కసారి వారివైపునుంచి ఆలోచించండి.

వారిలోని సృజనాత్మకతను యాంత్రికంగా మార్చేయకండి. వారిని ఎదగనివ్వండి. ప్రతిభకు, సమర్థతకు ఈ దేశంలో లోటు లేదని నిరూపించనివ్వండి. దయచేసి ఆలోచించండి."

అందరికీ నమస్కరించి స్టేజీ దిగిపోయింది అన్విత. అంతవరకూ అనేక రకాల ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థులంతా ఒకేసారి స్టేజీ మీదకు వచ్చి అందరికీ అభివాదం చేసారు.

ఆహ్వానితులంతా కరతాళధ్వనులతో వారిని అభినందించారు. వారు అక్కడ ఉంటుండగానే అన్విత ఓ డెబ్బై ఏళ్ళ వృద్ధుడితో డయాస్ మీదకి వచ్చింది.

"ఈయన శ్రీ ఉమాశంకర్‌గారు- ఈ సందర్భంగా మీతో ఏమో చెప్పాలనుకుంటున్నారు. కొద్దిగా మీ సమయాన్ని కేటాయించమని అందర్నీ ప్రార్థిస్తున్నాను."

ఆయన మైక్ దగ్గరకు వచ్చి వణుకుతున్న చేతులతో మైకు పట్టుకున్నారు.

"నమస్కారం. నా పేరు ఉమాశంకరం. రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌ని. జీవితాంతం పిల్లలకు పాఠాలు చెప్పే టీచర్‌గా ఉన్న నేను నా జీవితానికి అవసరమైన పాఠం నేర్చుకోలేకపోయాను. లేక లేక పుట్టిన ఒక్కగానొక్క కొడుకు వృద్ధిలోకి రావాలని నాకున్నదంతా ధారపోసి వాడిని ఐఐటిలో చదివించాను. చిన్ననాటి నుంచి వాడి చదువుపట్ల కఠినంగా ఉంటూ వచ్చాను. వాడు ఒత్తిడికి గురి అవుతుంటే బాధ కలిగినా అది వాడి మంచి కోసమే కదా అని సరిపెట్టుకున్నానే తప్ప నా ధోరణి మార్చుకోలేదు. వాడి ఇష్టంతో ప్రమేయం లేకుండా నా కోసం యాంత్రికంగా చదువుతూ వచ్చిన వాడికి ఐఐటి కాన్పూర్‌లో సీటొచ్చింది. మొదట రెండు సంవత్సరాలు ఎలాగో నెట్టుకొచ్చిన వాడు మూడో సంవత్సరం ఏం జరిగిందో తెలియదు. ఎందుకు మనస్తాపం చెందేడో తెలియదు. ఐదవ అంతస్తు మీద నుంచి దూకేసాడు. నెలరోజులు మృత్యువుతో పోరాడుతూ మా కళ్ళ ముందే నరకం అనుభవిస్తూ మాకు నరకం చూపిస్తూ ఒకనాడు కన్నుమూసాడు. ఆనాడే మేమూ చచ్చిపోయాం...ఆనాడే మేమూ చచ్చిపోయాం" లాల్చీ జేబులోంచి రుమాలు తీసి ముఖం తుడుచుకుంటున్నట్లు నటించబోయిన ఆ వృద్ధుడు, అది చేతగాక- ఆ రుమాలుని అలాగే ముఖాన పెట్టుకుని బావురుమన్నాడు.

చూస్తున్న వారంతా నిశ్చేష్టులయ్యారు.

అప్రయత్నంగా అక్కడ ఉన్నవారి అందరి కళ్ళూ నిండిపోయాయి. చిక్కటి నిశ్శబ్దం ఆవరించుకొంది అక్కడ.

అన్విత లేచి వెళ్ళి ఆయన దగ్గరకు చేరుకుని భుజాల చుట్టూ చేయి వేసింది ఓదార్పుగా. ఆమెకు కూడా కళ్ళనీళ్ళు తిరిగాయి.

కొద్దిక్షణాల అనంతరం ఆయన తేరుకుని రుమాలుతో ముఖం కళ్ళు తుడుచుకున్నాడు.

"కనిపెంచిన పిల్లలు యాక్సిడెంట్‌లోనో, జబ్బు చేసో పోతే అది మన దురదృష్టం అనుకుంటాం. కానీ ఇలా చదువుల ఒత్తిడి భరించలేక..

ఫెయిలవుతామనే భయం చేత.

అలా జరిగితే తల్లిదండ్రులను ఎదుర్కోలేమోమో అన్న బాధతో ప్రాణాలు తీస్కుంటే..అది పూర్తిగా మన స్వయంకృతాపరాధం.

చదువులు పిల్లలకి జీవితాన్నివ్వాలే తప్ప తీసుకోకూడదు. దయచేసి చదువులని లైఫ్ అండ్ డెత్ క్వశ్చన్ క్రింది మార్చకండి.

ఇలా వాడి చదువే వాడి మృత్యువుకి కారణం అవుతుందని తెలిస్తే వాడి చేత అక్షరాలు కూడా దిద్దించే వాడిని కాదు. నాకు నా బిడ్డ కావాలి. అంతే తప్ప ఇంకేమీ వద్దు అని ఈరోజు తలబాదుకున్నా వాడు రావడం లేదు" గొంతు రుద్ధమైంది ఆయనకి.

"చదువుమీద స్వతహాగా ఆసక్తి ఉన్న పిల్లల్ని, చదువుకోనివ్వండి. అది తక్కువున్న వారిని ఒత్తిడి చేయొద్దు. వారికి నచ్చిన పని చేయనివ్వండి. అంతమాత్రాన వారి జీవితం వృథా అయిపోదు. రేపు మనం ఊహించలేనంత ఎత్తులకి వారు ఎదగవచ్చు. కాంపిటీషన్ పేరుతో వారి కలలని కాలరాసేయకండి. పోటీ పేరుతో మన పిల్లలని ఎండమావుల వెంట పరుగెత్తించవద్దు. వారి స్వేచ్ఛ వారికిస్తే జాతి గర్వించే ప్రతిభావంతులు ఎందరో వారి నుంచి వస్తారు. దయచేసి ఆలోచించండి, శలవ్!"

అందరికీ నమస్కరించి తడబడే అడుగులతో స్టేజీ దిగాడు ఆయన.

